కాళోజీ కళాక్షేత్రానికి కవులు దూరం

కాళోజీ అవార్డు గ్రహీతకూ అందని ఆహ్వానం

కళాసంస్థలకు సమాచారం ఇవ్వని అధికారులు

పోచమ్మమైదాన్, నవంబర్ 19: హనుమకొండలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన కాళోజీ కళాక్షేత్రానికి కొంత మంది కవులు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా ఓరుగల్లుకు చెందిన కాళోజీ నారాయణరావు అవార్డు గ్రహీత, ప్రముఖ కవి రామాచంద్రమౌళికి ఎలాంటి ఆహ్వానం అందకపోవడంతో ఆయన ప్రారంభోత్సవానికి వెళ్లలేదు. కళాకారులు, సాహితీవేత్తల కోసం రూ.కోట్లతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన కార్యక్రమానికి తమను ఆహ్వానించకపోవడంపై కవులు, రంగస్థల కళాకారులు, సాహితీవేత్తలు ఆగ్రహంగా ఉన్నారు. వరంగల్ నగరంలో దాదాపు 15 వరకు కళాసంస్థలు, ఐక్యవేదికలు, సాహితీసంస్థలు ఉన్నా వారికి చాలా వరకు ఆహ్వానాలు అందలేదని చెప్తున్నారు. ముఖ్యంగా సహృదయ, నేరెళ్ల వేణుమాధవ్, రంగస్థల కళాకారుల ఐక్యవేదిక తదితర సంస్థలను ఆహ్వానించలేదని సమాచారం. కాళోజీ ఫౌండేషన్ వారిని మాత్రమే ఆహ్వానించినట్టు తెలుస్తున్నది.

ఆహ్వానం పంపకుండా అవమానించారు

కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి నాకు ఆహ్వానం ఇవ్వకుండా అవమానించారు. కాళోజీ నారాయణరావు అవార్డు అందుకున్న నేను.. అధికారుల నుంచి ఆహ్వానం వస్తుందని ఊహించాను. అది జరగకపోవడంతో మనసు విరిగి ఆ కార్యక్రమానికి దూరంగా ఉన్నాను. ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా మమ్మల్ని విస్మరించారు. కాళోజీ ఫౌండేషన్ నుంచి కూడా నాకు ఎలాంటి సమాచారం అందకపోవడం బాధాకరం.

-రామా చంద్రమౌళి, ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత

కళా సంస్థలకు పిలుపులేకపోవడం సిగ్గుచేటు

కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి ఓరుగల్లులోని కళా సంస్థలకు ఆహ్వానం అందకపోవడం సిగ్గుచేటు. ఐదు దశాబ్దాల నుంచి రంగస్థల కళాకారులుగా పని చేస్తున్నాం. ఆట-పాట, ధూంధాం, తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చాం. కళాక్షేత్రం విషయమై ప్రసంగించేటప్పుడు కళాకారులు, సాహితీవేత్తలు లేకపోవడం ఎంతవరకు న్యాయం? మాకు ఆహ్వానం అందకపోవడం వల్లనే దూరంగా ఉన్నాం.

-డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు

ప్రజాకవి కాళోజీకే అవమానం!

అవార్డు ప్రకటించి ఇవ్వకపోవడం దారుణం • దుష్ట సంప్రదాయానికి తెరలేపిన సర్కార్ • సాహితీలోకం ఆవేదన

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీని, తెలంగాణ సాహితీకారులను రేవంత్‌రెడ్డి సర్కార్ అవమానించిందని సాహితీలోకం ఆవేదన వ్యక్తంచేస్తున్నది. ప్రముఖ సాహితీవేత్త, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ఈయేడు కాళోజీ పురస్కారాన్ని ప్రకటించిన ప్రభుత్వం.. దానిని బహూకరించకుండా విస్మరించిందని విమర్శిస్తున్నారు. 2015లో కేసీఆర్ ప్రభుత్వం నెలకొల్పిన అవార్డును కాళోజీ జయంతి నాడు (సెప్టెంబర్ 9) ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. తొలి అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ నుంచి 2023లో జయరాజ్ వరకు ప్రకటించిన అవార్డులను ప్రతి యేటా కాళోజీ జయంతినాడే సభ నిర్వహించి అందజేశారు. కరోనా సమయంలో (2020) కూడా కేసీఆర్ ఆ ఆనవాయితీని కొనసాగించారు. కొవిడ్ మార్గదర్శకాల నేపథ్యంలో సభ నిర్వహించే పరిస్థితులు లేకపోవడంతో ఆ సంవత్సరం పురస్కార విజేత, ప్రముఖ సాహితీవేత్త రామాచంద్రమౌళిని ప్రగతిభవన్ (నేటి ప్రజాభవన్)కు పిలిపించి కేసీఆర్ స్వయంగా అవార్డు అందజేసిన సందర్భాన్ని సాహితీవేత్తలు గుర్తుచేస్తున్నారు. ఆ సంప్రదాయానికి సీఎం రేవంత్‌రెడ్డి గండికొట్టారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాళోజీ జయంతినాడు అందించే ఆనవాయితీని తప్పిన ప్రభుత్వం కనీసం కాళోజీ కళాకేంద్రం ప్రారంభోత్సవం రోజైనా అందజేస్తుందని ఆశించారు. మంగళవారం కాళోజీ కళాకేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా నలిమెల భాస్కర్‌కు అవార్డు ప్రదానం చేయకుండానే విస్మరించారు. దీనిపై సాహితీలోకం విస్మయం వ్యక్తంచేస్తున్నది. ఇప్పటికైనా నలిమెల భాస్కర్‌కు అవార్డును ప్రదానం చేయాలని డిమాండ్ చేస్తున్నది.

ఇప్పటివరకు కాళోజీ అవార్డు విజేతలు..

సంవత్సరం	పురస్కార గ్రహీత
2015	అమ్మంగి వేణుగోపాల్
2016	గోరటి వెంకన్న
2017	రావులపాటి సీతారాం
2018	అంపశయ్య నవీన్
2019	కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి
2020	రామా చంద్రమౌళి
2021	పెన్నా శివరామకృష్ణ
2022	రామోజు హరగోపాల్
2023	జయరాజ్
2024	నలిమెల భాస్కర్

అభివృద్ధిని అడ్డుకుంటే జైలుకే!

మొదటిపేజీ తరువాయి...

రాజకీయ వ్యాఖ్య లు చేస్తూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై అసహనంతో ఊగిపోయారు. 'కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి ఇద్దరిని వదిలిపెట్టిండు. వారు ఊర్లమీదపడి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. అభివృద్ధి కాళ్లకు కట్టె పెడితే జైలులో పెట్టి ఊచలు లెక్కబెట్టిస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు.

కిషన్‌రెడ్డి మోదీకి గులాంగిరి

గుజరాత్‌లో నరేంద్రమోదీ సబర్మతి నదిని అభివృద్ధి చేస్తే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చప్పుట్లు కొడతారని, హైదరాబాద్‌లో మూసీని అభివృద్ధి చేస్తామంటే మాత్రం అడ్డం పడుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అపహాస్యం చేసిన ప్రధాని మోదీ తెలంగాణ ద్రోహి అని, అలాంటి ద్రోహికి కిషన్‌రెడ్డి గులాంగిరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనను సోనియాగాంధీకి గులాం అని కిషన్‌రెడ్డి విమర్శించారని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ కాళ్లు కడిగి నెత్తిమీద పోసుకునేందుకు తాను సిద్ధమని చెప్పారు. 'కిషన్‌రెడ్డీ.. గుజరాత్‌కు గులాంవా? మోదీకి గులాంవా? గుజరాత్‌కు పోయి గాడిదలను కాసుకో.. అక్కడే గులాంగిరీ చేసుకో' అని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ అంటే ప్రపంచదేశాలకు ఒక ఉక్కు మహిళ అని, రాష్ట్రంలో ఉన్నది ఆడబిడ్డల రాజ్యమని ధైర్యంగా చెప్పుకోవాలని అన్నారు.

త్వరలో రుణమాఫీ పూర్తి

ఇప్పటికే రాష్ట్రంలోని రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అకౌంట్లు సరిగా లేకపోవడం, ఇతర కారణాలతో మాఫీ కాని వారికి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఖాతాలను సవరించుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్రానికి ప్రతినెలా రూ.18,500 కోట్లు ఆదాయం వస్తున్నదని, ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు రూ.6,500 కోట్లు, అప్పులపై వడ్డీలకు రూ.6,500 కోట్లు ఖర్చుపుతున్నాయని, మిగిలిన నిధులతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెవివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్టును పునరుద్ధరించి, పరిశ్రమలు నెలకొల్పితే కాకతీయవర్సిటీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. వరంగల్, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టులు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేసీఆర్ అనే మొక్కను మొలువనియ్యను

ప్రభుత్వ కార్యక్రమమైనా, కాంగ్రెస్ సభ అయినా సీఎం రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని అసందర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. వరంగల్‌లో నిర్వహించిన 'ఇందిర మహిళా శక్తి విజయోత్సవ సభ'లోనూ ఇదే పని చేశారు. 'కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనియ్యను.. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను మొలకెత్తనియ్యను.. రాసి పెట్టుకోండి... కేసీఆర్ కాస్కో చూద్దాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసందర్భ వ్యాఖ్యలు చేశారు. 'ఫామ్‌హౌస్‌లో ఉంటే నీ గురించి తెలవదనుకోకు.. నాకు ముందు తెలుసు.. వెనుక తెలుసు.. మళ్లీ చెప్తున్నా.. రా బయటకు.. నీ దుఃఖం ఏందో, నీ బాధ ఏందో అసెంబ్లీకి రా.. సమయం, తేదీ ఫిక్స్ చెయ్యి.. చర్చ పెడదాం.. ప్రజాల్లోకి రా.. వచ్చి మాట్లాడు..' అంటూ ఊగిపోయారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అధికారులు బస్సుల్లో తీసుకువచ్చారు. మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష, మాటలు అందరినీ విస్మయపరిచాయి. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి స్థాయి మరిచి బజారు భాష మాట్లాడారని సభకు వచ్చిన మహిళలు పేర్కొన్నారు.

వదురుబోతుతనంతో ఒరిగేదేం లేదు

- **రేవంత్ నోట బూతులు తప్ప నీతులు రావు**
- **ఏం ఒరగబెట్టిండ్రని విజయోత్సవాలు?**
- **అసమర్థ పాలనలో అపజయోత్సవాలు చేయండి**
- **ప్రజాపాలనంటే కంచెలు, ఆంక్షలేనా?**
- **లగచర్లకు వెళ్తున్న సామాజిక కార్యకర్తలను అడ్డుకోవడం దుర్మార్గం : హరీశ్‌రావు ఫైర్**

> **రేవంత్‌రెడ్డీ.. నువ్వు కేసీఆర్.. కేసీఆర్.. అని కేసీఆర్ నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు. కేసీఆర్ వంటి గొప్ప వ్యక్తి నీకు జీవితంలో అర్థం కాదు. తొక్కుకుంట వచ్చిన అని గప్పాలు కొడుతున్నవు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులనే తొక్కినవు. షార్ట్ కట్‌లో సీఎం అయ్యి ప్రజలను తొక్కుతున్నవు. - హరీశ్‌రావు**

> **రేవంత్‌రెడ్డీ.. మీరు చెప్పిన ఏడో హామీ యేనా ప్రజాపాలన? కంచెలు, ఆంక్షలు, నిర్బంధాలు లేని పాలన? ఇప్పుడు మీ పాలనలో అవి లేకుండా ఒక్కరోజూ కూడా గడవడం లేదు' అని ఎద్దేవా చేశారు. 'లగచర్ల గిరిజన బిడ్డలకు జరిగిన అన్యాయం వెలుగు చూడకుండా ఇంకెంతమందిని అడ్డుకుంటరు? అక్రమ కేసులు పెడుతూ ఇంకెంత మంది నోర్లు మూయిస్తరు?' అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు. - హరీశ్‌రావు**

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : వరంగల్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. 'శాతగానోనికి మాటలెక్కువ, చేవలేనోనికి బూతులెక్కువ అన్నట్టు ఉన్నది రేవంత్‌రెడ్డి పరిస్థితి' అని దెప్పిపొడిచారు. 11 నెలల పాలనలో రేవంత్ నోటి వెంట బూతులు తప్ప నీతులు రాలేదని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ విజయోత్సవ సభ అని పేరు పెట్టుకొని.. చేసిందేం లేక, చెప్పుకోడానికేం లేక ఎప్పటిలాగే పిచ్చి మాటలు మాట్లాడిండు.. ఇక నువ్వు ఎంత గింజుకున్నా లాభం లేదు. అశోక్ నగర్ నుంచి లగచర్ల దాకా, రైతుల నుంచి లంబాడా బిడ్డల దాకా నువ్వు చేసిన ఘోరాలు సమసిపోవు. తెలంగాణ ప్రజలు నిన్ను మరిచిపోరు' అని హెచ్చరించారు.'నీ వదురుబోతు తనంతో రాష్ట్రానికి ఒరిగేదేం లేదు. నీ దుర్భాషను ప్రజల విచక్షణకే వదిలేస్తున్నం' అని ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి ఏం ఒరగబెట్టారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారో చెప్పాలని నిలదీశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరంగల్ వేదికగా ఇచ్చిన రైతు డిక్లరేషన్‌కు ఏడాదైనా అతీగతీ లేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని, రూ.15 వేల భరోసా దిక్కులేదని, రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇవ్వనేలేదని, బోనస్ బోగస్ చేశారని దుయ్యబట్టారు. 'ఆనాడు మీరు ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఇందుకేనా మీ వరంగల్ విజయోత్సవ సభ రేవంత్‌రెడ్డీ? మీ పది నెలల పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేండ్ల వెనక్కి వెళ్లింది. కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ, నేడు తిరోగమనం బాటపట్టింది' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదికి వచ్చి నిరసనలు తెలియజేసే దుస్థితి వచ్చింది.. వద్దురో నాయనా కాంగ్రెస్ పాలన అని పాటలు పాడుకుంటున్న పరిస్థితి తలెత్తింది' అని హరీశ్‌రావు మండిపడ్డారు.'కేసీఆర్ పదేండ్లకాలంలో అన్నివర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటే, పది నెలల పాలనలో నువ్వు అందరి కడుపు కొట్టినవు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచినవు. మీరు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు రేవంత్‌రెడ్డీ.. సక్సెస్‌ఫుల్‌గా ప్రజలను మోసం చేసినందుకు అపజయోత్సవాలు జరుపుకోవాలి' అని ఎద్దేవాచేశారు.

ఇప్పటికైనా కండ్లు తెరవండి..

'రాష్ట్రంలో పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది కావొస్తున్నది, ఇప్పటికైనా కాంగ్రెస్ పాలకులు కండ్లు తెరవండి.. అద్భుతాలు చేశామనే భ్రమ నుంచి బయటపడి ఇచ్చిన హామీలు అమలు చేయండి. గోబెల్స్ ప్రచారాలు పక్కనబెట్టి పరిపాలన మీద దృష్టి పెట్టండి. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయండి. మీ వైఫల్యాలను గుర్తించి మోసం చేసినందుకు వరంగల్ వేదికగా ప్రజలకు క్షమాపణలు చెప్పండి' అని హరీశ్ డిమాండ్ చేశారు.

సామాజిక కార్యకర్తలను అడ్డుకోవడం దుర్మార్గం

నిజనిర్ధారణ కోసం లగచర్లకు వెళ్తున్న సామాజిక కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని హరీశ్‌రావు ఆక్షేపించారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ఇతర మహిళా సభ్యులపై సర్కారు నిరంకుశ వైఖరిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అధికారం ఉన్నదని రేవంత్‌రెడ్డి ప్రజలనే కాదు, జర్నలిస్టులు, మానవహక్కుల కార్యకర్తలను కూడా నిర్బంధిస్తున్నడు. నిరంకుశ, రాక్షస పాలన కొనసాగిస్తున్నడు' అని దునుమాడారు.

> **ఎవరనుకున్నరు ఇట్లవునని.. ఎవరనుకున్నరు ఇట్లవునని అని ప్రజాకవి కాళోజీ నినదించినట్టు కాంగ్రెస్ చేతిలో ప్రజలు దగా పడ్డరు. రైతులు దారుణంగా మోసపోయిండ్రు. ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు.. అపజయాలను కప్పిపుచ్చుకొనేందుకు వరంగల్ వేదికగా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. ఏం సాధించారని సంబురాలు జరుపుకొంటున్నరు రేవంత్‌రెడ్డీ? - హరీశ్‌రావు**

కాళోజీ పురస్కారం ఇవ్వకపోవడం శోచనీయం

సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్‌కు ప్రకటించిన కాళోజీ పురస్కారం ఇవ్వకపోవడం శోచనీయని హరీశ్ పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ జయంతి నాడు సాహితీవేత్తలకు పురస్కారమిచ్చి గౌరవించుకొనే సంప్రదాయాన్ని దురుద్దేశంతో విస్మరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 'ఇది ఒక్క నలిమెల భాస్కర్‌కు జరిగిన అవమానం కాదు..తెలంగాణ కవులందరికీ జరిగిన అవమానం' అంటూ దుమ్మెత్తిపోశారు.

> **పురుగుల్లేని భోజనం కోసం గురుకుల పిల్లలు.. స్కాలర్ షిప్పుల కోసం విద్యార్థులు.. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు.. రుణమాఫీ, రైతు బంధు కోసం రైతన్నలు.. జీతాల కోసం ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు.. డీఏ, పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు.. నిధుల విడుదల కోసం గ్రామ పంచాయతీ సిబ్బంది.. ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ పల్లె ప్రజలు.. ఇండ్లు కూలగొట్టొద్దని హైడ్రా బాధితులు.. ఏక్ పోలీసింగ్ కోసం పోలీసులు.. పింఛన్ల కోసం వృద్ధులు.. ఇలా పిల్లల నుంచి వృద్ధుల దాకా అందర్నీ సక్సెస్‌ఫుల్‌గా రోడ్ల మీదికి తెచ్చినందుకా విజయోత్సవాలు? -హరీశ్‌రావు**

ఏం సాధించారని విజయోత్సవాలు?

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం పదకొండు నెలల్లో ఏం సాధించిందని విజయోత్సవాలు నిర్వహిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైడ్రా పేరిట ప్రజలను రోడ్డుపైకి తెచ్చినందుకా? దళితులకు రెండో విడత దళితబంధు ఇవ్వనందుకా? నేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలైనందుకా? గురుకులాల్లో 42 మంది విద్యార్థులు మరణించినందుకా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పాలనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. కేసీఆర్‌ను తిట్టడం మాని 420 హామీల అమలుపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

సీఎం సభకు రావాల్సిందే!

- **లేదంటే లోన్లు బంద్..**
- **మహిళా సంఘాల సభ్యులకు మెప్మా బెదిరింపు**

వరంగల్, నవంబర్ 19: ఎన్ని పనులున్నా సరే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు రావాలని మహిళా సంఘాల సభ్యులకు మెప్మా అధికారులు హుకుం జారీ చేశారు. లేదంటే లోన్లు రావని, సంక్షేమ పథకాలు కట్ చేస్తామని సీవో, ఆర్పీలు మహిళలను బెదిరించారు. దీంతో భయపడిన మహిళలు మంగళవారం హనుమకొండలో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. బహిరంగ సభకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు మెప్మా అధికారులు బస్సుల్లోనే భోజనాలు సమకూర్చారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్‌కు రెండు బస్సులు ఏర్పాటు చేసి సీవో, ఆర్పీలతో మహిళలను సభకు తరలించారు. మధ్యాహ్నం ఆర్పీల ద్వారా భోజన ప్యాకెట్లు అందజేశారు. మహిళలు మధ్యలో వెళ్లి పోకుండా ప్రతి బస్సుకు ఆర్పీలను ఏర్పాటుచేశారు.

అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టులు

- **ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన నేపథ్యంలో**
- **బీఆర్ఎస్, గిరిజన, విద్యార్థి సంఘం నేతల నిర్బంధం**

నమస్తే నెట్‌వర్క్, నవంబర్ 19: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటన సందర్భంగా పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచే ముందస్తుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులతోపాటు గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌లతోపాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, దళితబంధు సాధన సమితి సభ్యులను సైతం నిర్బంధించారు. ఆయా నేతల ఇండ్లకు వెళ్లి అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆరు గ్యారెంటీలపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తాయని, పెండింగ్ బిల్లులపై మాజీ సర్పంచ్‌లు నిలదీస్తారని, లగచర్ల ఘటనపై గిరిజన సంఘం నాయకులు అడ్డుకుంటారని, రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై విద్యార్థి సంఘం నాయకులు గొంతెత్తుతారని, దళితబంధు, ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు రచ్చ చేస్తారనే అనుమానంతో ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ శ్రేణులు, బీఆర్ఎస్వీ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, దళితబంధు సాధన సమితి ఉపాధ్యక్షుడు వేమునూరి జక్కయ్య, లంబడా హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్‌నాయక్, దళిత పోరాట హక్కుల సంఘం నాయకులు ఏలేందర్, రాచర్ల రాజేందర్ ఉన్నారు.

హనుమకొండ జిల్లా పరకాల పోలీస్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

విజయోత్సవాలకు నిధులు.. మాకిచ్చేందుకు లేవా?

- **అధికారులను నిలదీసిన డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు**
- **డిగ్రీ యాజమాన్యాలతో ఉన్నత విద్యామండలి చర్చలు**
- **ఓయూ మినహా అన్ని వర్సిటీల్లో బంద్ విజయవంతం**
- **26లోగా తేల్చకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మళ్లీ బంద్**
- **ప్రభుత్వాన్ని హెచ్చరించిన కాలేజీ యాజమాన్యాలు**

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : 'విజయోత్సవ సభలకు, పత్రికలకు యాడ్స్ ఇచ్చేందుకు డబ్బులుంటాయి. కానీ మాకు ఇచ్చేందుకు ఉండవా?' అంటూ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయలేమని కాలేజీ యాజమాన్యాలకు అధికారులు సర్దిజెప్పే ప్రయత్నం చేయడంతో పై విధంగా స్పందించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు తలపెట్టిన కాలేజీల బంద్ రాష్ట్ర మంతటా విజయవంతమయ్యింది. ఓయూ పరిధిలో మాత్రం విఫలమయ్యింది. యాజమాన్యాలు తలోదారి అన్నట్టుగా వ్యవహరించడంతో ఉస్మానియా పరిధిలో కాలేజీలు యథాతథంగా నడవగా, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. డిగ్రీ కాలేజీల బంద్ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపింది. చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ మంగళవారం పలు దఫాలుగా కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలమయ్యాయని, మంగళవారం నుంచి డిగ్రీ పరీక్షలు యథాతథంగా జరుగుతున్నాయని ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ చెప్పారు. మంగళవారం ఓయూ పరిధిలో కాలేజీలు యథాతథంగా నడవగా, ఓయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచే ప్రారంభమయ్యాయి. అయితే బంద్, యాజమాన్యాల హెచ్చరికల నేపథ్యంలో ఉన్నత విద్యామండలి వర్సిటీలకు కీలక ఆదేశాలిచ్చింది. ఓయూ మినహా మిగతా వర్సిటీల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను 26 నుంచి ప్రారంభించాలని సూచించింది. ఓయూ మినహా మిగతా వర్సిటీల సెమిస్టర్ పరీక్షలు ప్రారంభయ్యే ఈ నెల 26లోగా ఏదో ఒకటి తేల్చాలని, లేకపోతే మళ్లీ బంద్‌కు దిగుతామని కాలేజీల యాజమాన్యాలు అధికారులను హెచ్చరించినట్టు తెలిసింది. 23లోపు సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ తీసుకుని, సీఎం వద్దకు యాజమాన్యాలను తీసుకెళతామని అధికారులు హామీనివ్వడంతో యాజమాన్య సంఘం నేతలు ఒప్పుకున్నట్టు అధికారులు తెలిపారు.

ముగ్గురు మంత్రులు డుమ్మా

- **ఓరుగల్లు సభకు హాజరుకాని ఉత్తమ్, రాజనర్సింహ, తుమ్మల**
- **కాంగ్రెస్ సభలా సర్కారు ప్రోగ్రాం**
- **అధికారుల సమన్వయ లోపం**
- **మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులకు అవమానం**
- **సీఎస్‌కే కుర్చీ లేని దుస్థితి**
- **మేయర్ సుధారాణికి అదే పరిస్థితి**
- **కుర్చీలు ఆక్రమించిన నాయకులు**
- **కవులకు పిలుపులేకుండా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం**

వరంగల్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా 'ఇందిరా మహిళాశక్తి-ప్రజాపాలన విజయోత్సవాలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సభకు ముగ్గురు సీనియర్ మంత్రులు డుమ్మా కొట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మొదటినుంచి దూరంగా ఉంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి, మంత్రి అయిన తుమ్మల నాగేశ్వర్‌రావు, మరో సీనియర్ మంత్రి దామోదర రాజనర్సింహ బహిరంగ సభకు హాజరుకాలేదు. ముగ్గురు సీనియర్ మంత్రులు ప్రభుత్వ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణులు సభలోనే చర్చించుకున్నారు.

కాంగ్రెస్ సభలా ప్రభుత్వ సభ

'ఇందిరా మహిళాశక్తి-ప్రజాపాలన విజయోత్సవాలు' సభ ప్రభుత్వ కార్యక్రమమే అయినా అడుగడుగునా కాంగ్రెస్ సభను తలపించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు కనీస నిబంధనలు మరిచిపోయారు. ప్రొటోకాల్ లేని అధికార పార్టీ నేతలు కుర్చీలను ఆక్రమించగా, ప్రజాప్రతినిధులు, అధికారులు కుర్చీలు లేక ఇబ్బందిపడ్డారు. పేరుకు మహిళాశక్తి సభ అయినా మహిళా ప్రతినిధులు, ఉన్నతాధికారులకే కూర్చునే అవకాశంలేకుండా పోయింది. స్వాగతోపన్యాసం చ